
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 26 జనవరి 2025





ఇందిరాగాంధీ స్టేడియంలో విద్యుద్దీపకాంతులు



బ్రిటీష్‌కాలం నాటి చెక్‌పోస్టు

పోరాటాల పురిటిగడ్డ

- సమరయోధుల ఖిల్లా మన గానుగపాడు
- రజాకార్లకు వెన్నుచూపని ఇక్కడి పోరాటయోధులు
- బ్రిటీష్ వారి చెక్‌పోస్టు భవనంపై జాతీయ జెండా
- వందేమాతర ఉద్యమానికి గుర్తుగా నాటి బావి

8లో

గణమైన ఏర్పాట్లు

గణతంత్ర వేడుకలకు సర్వం సన్నద్ధం

- త్రివర్ణమయమైన ఇందిరాగాంధీ స్టేడియం
- జెండా ఆవిష్కరణకు హాజరుకానున్న గవర్నర్, సీఎం
- మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకుల రాక
- ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న త్రివిధ దళాల కవాతు
- భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు
- ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుద్దీప కాంతులు
- బందరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోనూ భారీ ఏర్పాట్లు
- జెండా ఎగరేయనున్న కలెక్టర్ బాలాజీ
- వాడవాడలా వేడుకలకు ఏర్పాట్లు



మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సిద్ధమైన సభావేదిక

భూమ్..!


ఉమ్మడి కృష్ణాలో భూముల ధరల పెంపు జాబితా రెడీ

ర్యాపిడ్ గ్రోత్ ఏరియాల్లో కనిష్టంగానే పెరుగుదల ● విజయవాడలో 3 నుంచి 8 శాతంలోపే..

భూముల ధరల పెంపుదలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు సంబంధించి గతంలో పెంచిన ప్రాంతాలతో పాటు పెంచని వాటికి వేర్వేరుగా ధరలను నిర్దేశించారు. గతంలో అసాధారణంగా పెంచిన ప్రాంతాల్లో ఓ మోస్తరుగా, నాలుగేళ్లుగా భూముల ధరలను అసలు పెంచని, పెద్దగా పెంచని ప్రాంతాల్లో మాత్రం భారీగానే పెంపునకు నిర్ణయించారు. నిర్దేశించిన ధరలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నా, ఈనెల 28న ప్రభుత్వం అనుమతిస్తే ఆ వెంటనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

- గ్రేటర్ విలీన గ్రామాల పరిధిలోనూ అంతంతమాత్రమే..
- నాలుగేళ్లుగా అసలు పెరగని ప్రాంతాల్లో 10 శాతం పెంపు
- కంకిపాడు-గుడివాడ మార్గంలో 10 శాతం
- మూడొంతుల మున్సిపాలిటీల్లో 10 శాతం
- నగర పంచాయతీల పరిధిలో 5 శాతం
- ప్రతిపాదనలకు రెండు జిల్లాల జేసీల ఆమోదం
- పెంపుదలపై 28న తుది నిర్ణయం వెలువడే అవకాశం



బెజవాడలో స్వల్ప పెరుగుదల

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న భూములకు ప్రతిపాదించిన ధరలన్నింటికీ ఇప్పటికే రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్ల ఆమోదం లభించింది. ఎన్టీఆర్ జిల్లాలో ప్రధానమైన విజయవాడ నగరంలో చాలా తక్కువగా భూముల ధరల పెంపునకు ప్రతిపాదించారు. బందరు రోడ్డులో గజం రూ.1.05 లక్ష, ఏలూరు రోడ్డులో గజం రూ.లక్ష మేర ఇప్పటికే ఉంది. మార్కెట్ ధరలతో సమానంగా రిజిస్ట్రేషన్లు పెరిగిపోయాయి. ఈ కారణంగా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నగరంలో కనిష్టంగా 3 శాతం నుంచి గరిష్టంగా 8 శాతంలోపు మాత్రమే భూముల ధరలను పెంచారు. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు పరిధిలో 8 శాతం పెంపుదల చేపట్టారు. బీసెంట్ రోడ్డు, ఆ సమీప వాణిజ్య కూడలి ప్రాంతాల్లో 5 శాతం మేర పెంచారు. పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో 3 నుంచి 5 శాతం మేర పెంపుదల చేశారు. తూర్పు నియోజకవర్గంలో ఒక్క బందరు రోడ్డు తప్ప.. ఆటోనగర్ గేట్ నుంచి బెంజిసర్కిల్ వరకు కూడా 5-7 శాతం పెరుగుదలే చూపించారు. బందరు రోడ్డుకు రెండువైపులా కాలనీల పరిధిలో మాత్రం 4-6 శాతం మేర పెంచారు.

గ్రేటర్ విలీన గ్రామాల్లోనూ నామమాత్రంగానే..

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లో అసాధారణంగా ధరలు పెరుగుతాయనుకున్నప్పటికీ.. ఆ స్థాయిలో ఏమీ జరగలేదు. విజయవాడ పశ్చిమ బైపాస్, ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదనల నేపథ్యంలో భారీగా ధరలు పెరిగే అవకాశం ఉందనుకున్నారు. కానీ, అలా జరగలేదు. గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లో కానూరు శరవేగంగా విస్తరిస్తున్న ప్రాంతం. ఇక్కడి నుంచి పెనమలూరు, కంకిపాడు వరకు కూడా విస్తరణ జరుగుతోంది. ఇలాంటపుడు అనూహ్యంగా ధరలు పెంచుతారని భావించినా అలా జరగలేదు. అభివృద్ధి తారస్థాయిలో జరుగుతున్నా.. భూముల ధరలు విజయవాడతో పోల్చుకుంటే తక్కువే. ఈసారి కానూరు నుంచి పెనమలూరు వరకు భూముల ధరలు భారీగా పెంచే అవకాశం ఉందని భావించినా కేవలం 5 నుంచి 10 శాతం వరకే పెంపుదల చూపించారు. వైసీపీ హయాంలో గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలైన రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, గూడవల్లి, గన్నవరం, చిన అవుటపల్లి, బీబీగూడెం, కొండపావులూరు, ముస్తాబాద, సూరంపల్లి, వెదురుపావులూరు, నున్న, జక్కంపూడి, అంబాపురం, గొల్లపూడి వంటి ప్రాంతాల్లో 30 శాతం మేర పెంచారు. విజయవాడ వెస్ట్ బైపాస్‌ను దృష్టిలో ఉంచుకుని ఇలా చేశారు. ఇటీవల ఈ ప్రాంతాలకు పునర్వైభవం వచ్చింది. నున్న, జక్కంపూడి, నైనవరం వంటి ప్రాంతాల్లో ఎకరం రూ.5 కోట్లు పలుకుతోంది. మిగిలిన ప్రాంతాల్లో రూ.3 కోట్ల పైచిలుకు ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో భూముల ధరలు పెరుగుతాయని భావించినా పెద్దగా పెంపుదల చేపట్టలేదు. కేవలం ఐదు శాతానికే పరిమితమయ్యారు.

గుడివాడ-కంకిపాడు మార్గంలో 10 శాతం

గుడివాడ-కంకిపాడు మార్గాన్ని త్వరలో ఎన్‌హెచ్‌కు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మార్గాన్ని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో మాత్రం 10 శాత మేర భూముల ధరలు పెంచారు.

5 నుంచి 10 శాతం మేరకు..

సీఆర్‌డీఏ ప్రాంతాలైన మైలవరం, కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లోనూ పెంపు పెద్దగా చేపట్టలేదు. కేవలం 5 శాతం మాత్రమే ప్రతిపాదించారు. రెండు జిల్లాల్లోని పట్టణ ప్రాంతాలు, తాడిగడప, కొండపల్లి వంటి మున్సిపాలిటీల్లో మినహా మిగిలిన వాటిలో 10 శాతం మేర భూముల ధరలు పెంచారు. నగర పంచాయతీల పరిధిలో 5 శాతం మాత్రమే పెరిగింది. అయితే, ఈ ధరలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయా అనే విషయంపై స్పష్టత లేదు. ఈనెల 28న రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో సమావేశం జరగనుంది. ఆరోజు ప్రభుత్వం ఆమోదిస్తేనే దీనికి సంబంధించి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

కలెక్టర్ బాలాజీకి అవార్డు



కలెక్టర్ బాలాజీ శనివారం బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతులమీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో తప్పులులేని, కచ్చితమైన ఓటర్ల జాబితాలను తయారుచేయడం, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు బాలాజీని ఈ అవార్డు వరించింది.

- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

విమానాశ్రయంలో లోకేశ్‌కు ఘనస్వాగతం



8లో

జగన్‌రెడ్డి, విజయ సాయిరెడ్డి ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మరు

- మంత్రి కొల్లు రవీంద్ర 8లో



నిమ్మకూరులో బాలకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

బాలకృష్ణానందం

పద్మభూషణ్‌పై సర్వత్రా హర్షం

నిమ్మకూరులో ఆనందోత్సాహాలు

బాలయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం



మచిలీపట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు, నిర్మాత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బాలకృష్ణకు పామర్రు మండలం నిమ్మకూరు గ్రామంతో విడదీయ రాని సంబంధం ఉంది. ఆయన తండ్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు నిమ్మకూరులోనే జన్మించారు. దీంతో బాలకృష్ణ తరచూ ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడున్న వారి బంధువులు, స్నేహితులు ఆయన్ను అక్కున చేర్చుకుంటారు. ఆయన అభిమాన సంఘ ప్రతినిధులు కూడా ఇక్కడున్నారు. బాలకృష్ణ నటించిన 'పాండురంగడు' సినిమా ప్రీరిలీజ్ వేడుక మచిలీపట్నంలోనే జరిగింది. బసవ తారకం కేన్సర్ ఆసుపత్రి నిర్వహణలో బాలకృష్ణ చూపుతున్న సేవా దృక్పథం ఎనలేనిది. మచిలీపట్నానికి చెందిన ప్రముఖ కేన్సర్ స్పెషలిస్టు నోరి దత్తాత్రేయుడు ఈ ఆసుపత్రి నిర్వహణకు చూపిన చొరవ అందరికీ తెలిసిందే. కాగా, బాలకృష్ణకు పద్మభూషణ్ ప్రకటించడంపై మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హర్షం వ్యక్తం చేశారు. నిమ్మకూరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం రాత్రి బాలకృష్ణ చిత్రపటానికి కుమార్‌రాజా క్షీరాభిషేకం చేశారు.

మీనమేషాలేల..?

వేట నిషేధ భృతి అందక మత్స్యకారుల ఆవేదన

- గత ఏడాది భృతి నవంబరులో ఇస్తామన్న అధికారులు
- గడువు ముగిసినా స్పందన శూన్యం
- రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామన్న కూటమి ప్రభుత్వం
- ఆదుకుని ఆర్థిక బాధలు తీర్చాలంటూ మత్స్యకారుల వేడుకోలు



నాగాయలంక పడవల రేవులో ఆగి ఉన్న బోట్లు

అవనిగడ్డ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : చేపల వేట నిషేధిత కాలం ముగిసి ఆరు నెలలవుతున్నా ఇంతవరకు భృతి ఇవ్వకపోవడంపై జిల్లాలోని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపల, మత్స్య సంపద సంతాన ఉత్పత్తి సమయంలో ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు దేశవ్యాప్తంగా వేట నిషేధం అమల్లో ఉంటుంది. ఈ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు వేట నిషేధిత భృతి అందిస్తుంది. అయితే, నిషేధిత కాలం ముగిసి ఆరు నెలలైనా భృతి అందకపోవడం, దాదాపు మూడు నెలలపాటు వరదలు, తుఫాన్ల కారణంగా వేటకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. చేసిన అప్పులు తీర్చలేక ఆందోళన చెందుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 12,809 మంది అవస్థలు

వేట నిషేధిత కాలంలో మత్స్యకారులకు గతంలో రూ.10 వేలు ఇచ్చేవారు. ఆ భృతిని రూ.20 వేలకు పెంచుతామని కూటమి ప్రభుత్వంలోని పార్టీలు హామీ ఇచ్చాయి. 1996లో నాటి టీడీపీ ప్రభుత్వమే వేట నిషేధిత కాల భృతిని ఇవ్వటం ప్రారంభించగా, దానిని క్రమేణా పెంచుతూ వచ్చిన చరిత్ర ఆ పార్టీదే. దీంతో జిల్లాలోని మత్స్యకారులంతా రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడితే హామీ నెరవేరుతుందని ఆశించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడకముందే అధికారులు.. జిల్లాలో 12,809 మందిని అర్హులుగా గుర్తించి భృతి ఇవ్వాలని నివేదించారు. అయితే, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో నవంబరు 22న ఈ భృతిని అందిస్తారని మత్స్యశాఖ అధికారులు నచ్చజెబుతూ వచ్చారు. అధికారులు చెప్పిన సమయం దాటిపోవటంతో ఈ సంవత్సరానికి వేట నిషేధిత కాల భృతి అసలు అందుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గతమంతా గడ్డుకాలమే..

జిల్లాలో మత్స్యకారులకు 2024 సంవత్సరం మొత్తం గడ్డుకాలంగానే గడిచింది. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల్లో దాదాపు 60 రోజులపాటు వేట నిషేధ కాలం అమల్లో ఉండగా, ఆగస్టు నుంచి వరుసగా మూడు నెలల పాటు వరదలు, తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తటంతో మత్స్యకారులకు వేటకు వెళ్లే వెసులుబాటు కలగలేదు. సముద్రపు మొగల వద్ద, బ్యాక్ వాటర్ పాయల్లోనూ వేట సాగించే మత్స్యకారులపై వరదలు తీవ్ర ప్రభావం చూపించగా, ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో మత్స్యసంపద అంతా లోపలికి వెళ్లిపోయింది. పెద్దపెద్ద బోట్లలో వేట సాగించే మత్స్యకారులకు కూడా అరకొరగానే చేపలు చిక్కాయి. ఈ నేపథ్యంలో దాదాపు ఐదు నెలల పాటు అప్పులతోనే కాలక్షేపం చేసిన మత్స్యకారులు ప్రభుత్వం రూ.20 వేల మొత్తాన్ని భృతి కింద ఇస్తే అప్పులైన తీరుతాయని వేడుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 12,809 మంది మత్స్యకారులకు ఈ భృతి అందాల్సి ఉండగా, ఒక్క అవనిగడ్డ నియోజకవర్గంలోనే 5,869 మంది ఉన్నారు.

త్వరలోనే భృతి అందుతుంది

వేట నిషేధిత కాలంలో ఉపాధి లేక ఇబ్బందిపడే మత్స్యకారులకు భృతిని అందించాలన్న ఉద్దేశంతో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేశాం. మత్స్యశాఖ ద్వారా ఇప్పటికే అర్హుల జాబితాను ప్రభుత్వానికి పంపించాం. త్వరలోనే వారి ఖాతాల్లో భృతి మొత్తం జమవుతుంది.

- ఆర్.ప్రతిభ, ఏడీ ఫిషరీస్, అవనిగడ్డ

టిడ్కో లబ్ధిదారులతో త్వరలోనే గృహ ప్రవేశాలు

- రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపల్లి అజయ్‌కుమార్ వెల్లడి
- జక్కంపూడి టిడ్కో ఇళ్ల పరిశీలన

8లో

విమానాశ్రయంలో లోకేశ్‌కు ఘనస్వాగతం



మంత్రి నారా లోకేశ్‌తో ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే యార్లగడ్డ, మాజీ మంత్రి పీతల సుజాత

గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటనను ముగించుకుని తిరిగి వచ్చిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయనకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు వర్లకుమార్ రాజా, భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి పీతల సుజాత, టీడీపీ నాయకులు అబ్దుల్ నజీర్, దూంండి రాకేశ్, రవి నాయుడు, నాదెండ్ల బ్రహ్మం, కనపర్తి శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన లోకేశ్ ఉండవల్లి వెళ్లారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



సీనియర్ సిటిజన్ వెంకట రత్నం, సీతాబాయి దంపతులను సత్కరిస్తున్న జేసీ గీతాంజలి

మచిలీపట్నం టౌన్ , జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. ఓటు హక్కు పొందడం.. ఓటు వెయ్యడం అందరి బాధ్యత అని చెప్పారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు అర్హులని తెలిపారు. యువత విధిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటరు వేమూరి వెంకట రత్నం, సీతాబాయి దంపతులను సత్కరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఓటు హక్కు మనందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో స్వాతి, డీఈవో పి.వి.జె.రామారావు, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా అధికారి సాల్మన్ రాజు, డీఎస్‌వో ఝాన్సీ లక్ష్మి పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో 'తోట్లవల్లూరు' హెచ్‌ఎంకు అవార్డు



అవార్డు అందుకుంటున్న జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఫణి రాజమోహన్

తోట్లవల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని ఓల్డ్ పోర్ట్ గ్రౌండ్‌లో ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగిన దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్‌లో టీచర్ కేటగిరిలో 'గణిత బోధనా ఉపకరణాలు' విభాగంలో చూపించిన ప్రతిభకు గాను తోట్లవల్లూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.ఫణి రాజమోహన్ ద్వితీయ అవార్డు గెలుచుకున్నారు. ఇందుకు గాను విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజికల్ మ్యూజియం(బెంగళూరు), కేంద్ర ప్రభుత్వం విభాగం మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ నుంచి అవార్డు, సర్టిఫికెట్, నగదు బహుమతిని అందుకున్నట్టు ఫణి రాజమోహన్ శనివారం తెలిపారు. కాగా, పోరంకిలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన స్టేట్ లెవెల్ సైన్స్ ఫెయిర్ పోటీల్లో విద్యార్థులు సులభంగా లెక్కలు నేర్చుకునే విధంగా రూపొందించిన 'గణిత బోధనా ఉపకరణాలు'ను ప్రదర్శించి ఈ సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్స్‌కు ఎంపికైన విషయం తెలిసిందే.

టిడ్కో లబ్ధిదారులతో త్వరలోనే గృహప్రవేశాలు

- రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపల్లి అజయ్‌కుమార్
- జక్కంపూడి టిడ్కో ఇళ్ల పరిశీలన



జక్కంపూడిలోని టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న రాష్ట్ర టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

విజయవాడ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో త్వర లోనే గృహప్రవేశాలు చేయిస్తామని రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపల్లి అజయ్‌కుమార్ అన్నా రు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలోని టిడ్కో ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. జగన్ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల విషయంలో వివక్ష చూపి నిర్మాణాలను తుది దశలో నిలిపివేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేములపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు రూ.36 వేల కోట్లతో గతంలో రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారన్నారు. నాలుగు లక్షల మంది లబ్ధిదారులకు వీటిని కేటాయించాలనుకున్నారని చెప్పారు. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేసి ఐదేళ్లు పాడు బెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తిరిగి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇటీవల టిడ్కో ఇళ్లపై సమీక్ష జరిపిన సీఎం చంద్రబాబు రూ.4500 కోట్ల హడ్కో రుణం కూడా మంజూరు చేయించారని తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి కొన్ని ఇళ్లు, ఏడాదిలో మిగిలిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. అలాగే టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం రైతుల నుంచి పలు చోట్ల భూములు సేకరించడం జరిగిందని, రైతులకు డబ్బులు ఇవ్వకుండా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం వేధింపులకు గురి చేసిందని ఆరోపించారు. త్వరలోనే రైతులు, కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు అమ్మిశెట్టి వాసు, అక్కల గాంధీ, బొలిశెట్టి వంశీ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వెహికల్‌తో పచ్చదనం పనులు

కృష్ణలంక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని మరింత వేగంగా తీర్చిదిద్దేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) వినూత్న పద్ధతులను అవలంబిస్తోంది. రాజధాని నగరంలో 35 రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచిన ఏడీసీ అధికారులు ఆరు వరుసల రహదార్లపై నీడనిచ్చే వివిధ రకాల పూల మొక్కలను పెంచాలని నిర్ణయించారు. 320 కిలోమీటర్లు మేర 20 నుంచి 30 మీటర్ల విస్తీర్ణంలో పచ్చదనం అభివృద్ధిని శరవేగంగా చేపట్టేందుకు ఏడీసీ నూతనంగా మల్టీపర్పస్ వెహికల్‌ను అందు బాటులోకి తెచ్చింది. దీని ద్వారా సుందరీకరణ పనులు శీఘ్రంగా జరుగుతాయి. ఒకేసారి ఇద్దరి పనిచేసే వెసులుబాటు ఈ వాహనం కలిగి ఉంది. అదేవిధంగా మొక్క నాటే ప్రదేశాన్ని చదును చేసి కావాల్సినంత మేర గొయ్యి చిటికలో తీయడానికి సాధ్యపడుతుంది. ప్రధానంగా ట్రీ ప్లాంటేషన్ చేయడానికి చక్కగా ఉపయోగపడుతుంది. సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి అనువైన యంత్రం. ఏడీసీ చైర్‌పర్సన్ అండ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారధి ఆదేశాలతో రాజధానిలో పచ్చదనం అభివృద్ధి పనులను ఈ యంత్రం సాయంతో ముందుకు సాగుతున్నాయి.

కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల హద్దుల ఏర్పాటు

తోట్లవల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఐలూరు, కనిగిరిలంకల్లో జరుగుతున్న రీ సర్వేలో భాగంగా శనివారం కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల సరిహద్దులను అధికారులు నిర్ణయించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే జోషీలా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శివరామప్రసాద్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు శ్రీనివాసరావు, వీఎస్ నాగేంద్ర బృందం మ్యాపుల ఆధారంగా సర్వే చేసి జిల్లాల హద్దులు పాతారు.



సరిహద్దులు నిర్ణయిస్తున్న రీ సర్వే అధికారులు

నాటి నైజాం పరిపాలనలో పోరాటాల స్ఫూర్తిగా ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక రాష్ట్రమిది. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి, గవర్నర్లు కూడా పనిచేశారు. మరి ఇప్పుడో ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్న ఒక కుగ్రామం గానుగపాడు. పోరాటాలకు పురిటిగడ్డ పేరుగాంచిన చారిత్రక గ్రామం. తిరువూరు నియోజకవర్గంలోని గానుగపాడుకు చరిత్రపుటల్లో సుస్థిర స్థానం ఉంది. నాటి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం సాగించడంతో పాటుగా, సారా వ్యతిరేక ఉద్యమానికి ఈ గ్రామం కేంద్ర బిందువుగా మారింది. నేటికీ ఆ గ్రామంలో బ్రిటీషు వారు నిర్మించిన ఠానా శిథిలం కాగా, గ్రామం నడిబొడ్డున నిర్మించిన చెక్ పోస్టు నాటి చరిత్రకు సాక్షిభూతంలా నిలుస్తోంది.- గానుగపాడు (తిరువూరు) ఆంధ్రజ్యోతి





చరిత్రను గుర్తుచేస్తున్న గ్రామ పెద్దలు



పోరాటాల పురిటిగడ్డ..!

సమరయోధుల ఖిల్లాగా గానుగపాడుకు చరిత్రపుటల్లో సుస్థిరస్థానం

- రజాకార్లపై వెన్నుచూపని పోరాట యోధులు
- పల్లెర్లమూడి గ్రామంలో ఆయుధాల తయారీ
- బ్రిటిషు పాలకులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు భవనంపై జాతీయ జెండా
- వందేమాతర ఉద్యమానికి గుర్తుగా నాటి బావి

రజాకార్లపై పోరాటంలో నాటి సమరయోధులు వారికి వ్యతిరేకంగా గానుగపాడు రిపబ్లిక్ కమిటీ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత టీ హయగ్రీవాచారి, గవర్నర్‌గా బి.సత్యనారాయణ, మరి కొంతమంది మంత్రులు నియమించుకుని ఏకంగా ప్రత్యేక ప్రభుత్వం ఏర్పాటు చేసి పాలనసాగించారు. అనంతర కాలంలో కొన్నాళ్లపాటు ఈ చెక్‌పోస్టు భవనంలో అంగన్‌వాడీ కేంద్రం, తదుపరి వీఆర్వో కార్యాలయంగా వినియోగించారు. ప్రస్తుతం ఈ భవనం చెట్లతో నిండి దర్శనమిస్తుంది. నాటి సమరయోధులు ఒకొక్కరుగా తనువుచాలించగా, వారి కుటుంబ సభ్యులు, స్వాతంత్ర్యదినోత్సవం, రిపబ్లిక్ వేడుకల సందర్భంలో తమ గ్రామంలో జరిగిన నాటి స్మృతుల్ని గుర్తు చేసుకుంటుంటారు. కాలక్రమంలో ఈ గ్రామం తిరువూరు మండలంలో చేరింది.

గతంలో తెలంగాణ గ్రామం 1945 నుంచి 1952 వరకు జరిగిన రజాకార్ల ఉద్యమానికి తిరువూరు తాలుకా ప్రజలకు పూర్తి సహకారాన్ని అందించిందీ గ్రామం. మొదట్లో ఈ గ్రామం వరంగల్ జిల్లా మధిర తాలుకాలో ఉండేది. తిరువూరు తాలుకాలో దిగుబడి అయిన ధాన్యం, ఇతర వస్తువులు తరలించాలంటే గానుగపాడులోని చెక్‌పోస్టు దగ్గర పన్నులు వసూళ్లు చేసేవారు. అంతేకాక గ్రామంలో కొనసాగిస్తున్న నాటి పాలకులకు వ్యతిరేకంగా గ్రామస్థులతో కలిసి తెలంగాణ కాంగ్రెస్ నేత బేతు కేశవరెడ్డి అధ్యక్షతన గానుగపాడు రిపబ్లిక్ కమిటీని ఎన్నుకొని, రజాకార్లకు వ్యతిరేకంగా పాలన సాగించడంతో పాటు, బ్రిటీషు పాలకులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు భవనంపై జాతీయ జెండాను ఎగురవేశారు.

పల్లెర్లమూడిలో ఆయుధాల తయారీ

గానుగపాడు రిపబ్లిక్ పాలకులు ప్రత్యర్థుల్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పోరాటపంథానే ఎంచుకున్నారు. తిరువూరుకు చెందిన గుండిమేడ లక్ష్మీనారాయణ. పసుపులేటి వీరయ్యతో పల్లెర్లమూడి (ప్రస్తుతం జి.కొత్తూరు శివారు)ను తీసుకొచ్చి ఆయుధాలు తయారు చేయించుకున్నారు. వీటి తయారీకి సికింద్రాబాద్ నుంచి నూర్ నరసింహాను పిలిపించారు. రజాకార్ల ఉద్యమం ప్రారంభమైన కొద్దిరోజులకే గానుగపాడు గ్రామానికి చెందిన వనం కృష్ణమూర్తి నాయకత్వంలో పోలిశెట్టిపాడుకు చెందిన కోటేరు రామచంద్రారెడ్డి, అత్తునూరి బాలిరెడ్డి తదితరులు గానుగపాడు ఠానాపై జాతీయజెండా ఎగురవేసి సంచలం సృష్టించారు.

వందేమాతర ఉద్యమం స్ఫూర్తిగా బావి

వందేమాతరం ఉద్యమస్ఫూర్తిగా 1905లో గ్రామం నడిబొడ్డున (బ్రిటీషు చెక్‌పోస్టుకు ఎదురుగా) గ్రామస్థులు బావి తవ్వించారు. మొదట మోటబావిగా తవ్వించగా, కాలక్రమంలో బావి చుట్టూ రక్షణగా గోడకట్టి నీరు తోడుకునేందుకు గిలకలు ఏర్పాటు చేశారు. సుదీర్ఘకాలం గ్రామస్థుల దాహార్తిని తీర్చింది. కాలక్రమంలో బోర్లు రావడంతో, ఈ బావి నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం బావిని సగం వరకు పూడ్చివేశారు.

ఆహ్లాదకరమైన వాతావరణం

గ్రామం చుట్టూ వాగులు, కొండలతో, మూడువైపుల రవాణా సౌకర్యంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఒకప్పుడు ఈ గ్రామంలో ఫ్లోరైడ్ నీటితో గ్రామస్థులు ఇబ్బందులు పడగా, ప్రస్తుతం సమీపంలోని కట్టలేరు నుంచి తాగునీటి సరఫరా పుష్కలంగా జరుగుతోంది. గానుగపాడుతో కలిపి, జి.కొత్తూరు, చౌటపల్లి, చిక్కుళ్లగూడెం. పల్లెర్లమూడి.టేకులపల్లి గ్రామాలను గ్రీన్‌సిటీస్‌గా ఈ ప్రాంత వాసులు పిలుస్తుంటారు.

బీసీల అభివృద్ధికి సీఎం కృషి

- బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

ధర్నాచౌక్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. 28న నిర్వహించే ఓబీసీ కుల సంఘాల సమావేశం ఆహ్వాన పత్రికను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ శనివారం క్యాంపు కార్యాలయంలో మంత్రికి అందజేశారు.

12 మంది గంజాయి విక్రేతల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీస్ అధికారులు

విజయవాడ, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): గంజాయి విక్రేతలు 12 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.40 లక్షల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్ ఫోర్స్ ఏడీసీపీ అరిటాకుల శ్రీనివాసరావు ఇన్ స్పెక్టర్ సీహెచ్ నాగశ్రీనివాస్, శ్రీధర్‌కుమార్ తో కలిసి విజయవాడలోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం వెల్లడించారు. కంకిపాడుకు చెందిన పెమ్మాడి మహేష్ అలియాస్ సమోస, కాటూరి మహేష్, బొడ్డు ఉమేష్, తెన్నేరుకు చెందిన రోహిత్ కుమార్, తాడిగడపకు చెందిన కొమ్మూరు సాయికిరణ్, గోశాలకు చెందిన పోలాన కిరణ్, పోరంకికి చెందిన ఖగ్గా వెంకట తరుణ్, విజయవాడ అయోధ్యనగర్‌కు చెందిన వల్లభనేని సాయిశ్రీరామ్, భవానీపురానికి చెందిన షేక్ అక్బర్ బాషా ఒడిశా నుంచి గంజాయిని తీసుకువస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గవర్నరుపేటలో విక్రయించడానికి ఈ తొమ్మిది మంది ప్రణాళికలు రూపొందించు కున్నారు. దీనితో వారిపై గవర్నరుపేట పీఎస్‌లో కేసు నమోదు చేశారు. వారిలో మహేష్, సాయిశ్రీరాం, ఉమేష్, అబ్బర్‌బాషా, కిరణ్‌పై సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. సాయికిరణ్, వెంకట తరుణ్‌పై రౌడీషీట్లు ఉన్నాయి. విజయవాడ లెనిన్ నగర్‌కు చెందిన నాదెళ్ల తరుణ్ చౌదరిపై గుణదల పీఎస్‌లో సస్పెక్ట్ షీట్ ఉంది. తరుణ్ చౌదరి, మురళీనగర్‌కు చెందిన ఫాతిమాపైనా గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్ణానందపేటకు చెందిన దుంగల మురళి అలియాస్ పండుపై సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ 12 మంది నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

జగన్‌రెడ్డి,సాయిరెడ్డి ఎన్నిడ్రామాలాడినా ప్రజలు నమ్మరు: మంత్రి



మచిలీ పట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): జగన్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఎన్ని డ్రామా లాడినా ప్రజలు నమ్మరని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. శనివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాష్ట్రాన్ని పీల్చిపిప్పిచేశారన్నారు. విజయసాయిరెడ్డి చేసిన అవినీతి, భూ దందాలు ఒక్కొక్కటి బయటపడటంతో డ్రామాలకు తెరతీశారని చెప్పారు. కాకినాడ పోర్టు విషయంలో విజయసాయిరెడ్డి బండారం బయట పడిందన్నారు. విశాఖపట్నంలో చేసిన భూ దోపిడీల స్నీటిని ప్రభుత్వం త్వరలో బయటపెడుతుందని చెప్పారు. అధికారం ఉన్నప్పుడు కన్నుమిన్ను తెలియకుండా రోజులు గడిపి, ఇష్టం వచ్చినట్టు వీర్ర వీగారన్నారు. ఇప్పు డు తమ బండారం బయట పడటంతో విజయ సాయిరెడ్డి రాజీనామా చేస్తున్నారని తెలిపారు. విజయ సాయిరెడ్డి దేశం విడిచి వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం, నిఘా సంస్థలు దృష్టి సారించాలన్నారు. చంద్రబాబు, లోకేశ్ కుటుంబాలపై విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికీ అవినీతి, దోపిడీ, భూదందాల నుంచి తప్పించు కునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మునిగిపోయిన వైసీపీ పడవలో ఉండలేక ఒక్కొక్కరు బయటకు వస్తున్నారని మంత్రి రవీంద్ర వివరించారు.

సర్వం సిద్ధం





పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు (ఇన్‌సెట్‌లో) సిద్ధమైన సభావేదిక

మచిలీపట్నం, జనవరి25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవానికి మచిలీపట్నం పోలీస్ పరేడ్‌గ్రౌండ్ ముస్తాబైంది. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టర్ బాలాజీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతిని వివరిస్తూ ప్రసంగిస్తారు. దేశభక్తిని చాటుతూ జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చాటిచెప్పేలా పలు శకటాలను, స్టాల్స్‌ను సిద్ధం చేశారు. జిల్లాలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను కలెక్టర్, ఎస్పీ గంగాధరరావు, జేసీ గీతాంజలిశర్మ చేతుల మీదుగా అందజేయనున్నారు. పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ బాలాజీ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఏఎస్పీలు వీవీ నాయుడు, బి.సత్యనారాయణ శనివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



తోట్లవల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపర్రు ఉత్తర ఎస్సీ కాలనీ పాఠశాల ఆవరణలో గరికపర్రు లయన్స్ క్లబ్, పటమట ప్రాభవ్ లయన్స్ క్లబ్, పటమట హరిత విద్యా గోల్డ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఆదివారం వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 499

రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలి

కంకిపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడల వరకు తమ పాఠశాల విద్యార్థులు రాణి స్తారని కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం జి.బి.కె సుధారాణి అన్నారు. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన 84వ గ్రిగ్ మెమోరియల్ సెకండరీ ఉన్నత పాఠశాలల బాలుర ఆటల పోటీల్లో జూనియర్స్ విభాగంలో గెలుపొందిన విద్యార్థులను ఆమె శనివారం అభినందించారు.



ఆటల పోటీల విజేతలతో హెచ్ఎం సుధారాణి, ఇతర ఉపాధ్యాయులు

ఉయ్యూరులో వైద్యశిబిరం నేడు

ఉయ్యూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్, జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శివాలయం రోడ్డులో నాగళ్ల రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే శిబిరంలో గుండె వైద్యనిపుణులు కాగిత కృష్ణచంద్, మెదడు, వెన్నుముక శస్త్ర వైద్యనిపుణులు కాగిత రాకేశ్, సెంటినీ హాస్పి టల్స్ వైద్య సిబ్బంది పరీక్షలు చేస్తారని తెలిపారు.

28న గన్నవరంలో జాబ్‌మేళా

గన్నవరం,జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గన్నవరం రోటరీ క్లబ్‌లో అమరరాజా గ్రూప్ సంస్థల సహకారంతో ఈ నెల 28న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా మెషిన్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

600 మందికి వైద్యపరీక్షలు

ప్రసాదంపాడు : ఉచిత వైద్య శిబిరంలో 600 మంది పేద ప్రజలకు నిపుణులైన ప్రముఖ వైద్యలచే గుండె, ఊపిరితిత్తులు పలు వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందిచినట్లు ఫస్ట్ మెస్సీయ ఫెలోషిప్ నిర్వాహకులు సజ్జా ప్రసాదరావు తెలిపారు. శనివారం ప్రసాదంపాడు ఎస్ఈఆర్ సెంటర్ ఫస్ట్ మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులైన సజ్జా ఎలియాజరు, కన్వీనర్ కోడూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గుర్రం శేషు (65) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టి ముందు టైర్లు ఎక్కడంతో బాడీ నుజ్జునుజ్జు అయ్యి మృతి చెందాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడు అప్పడాలు, జంతికలు అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్ వైద్యులు

కంటి సంరక్షణలో జాగ్రత్తలు తప్పనిసరి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : కంటి సంరక్షణలో నిర్లక్ష్యం కూడదని డాక్టర్ రాహుల్ తెలిపారు. ఆరుగొలను టీడీపీ అధ్యక్షుడు బేతా శేషకుమార్ ఆధ్వర్యంలో శంకర గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్ సహకారంతో శనివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆరుగొలను, ఓగిరాల, తిప్పనగుంట తదితర చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన 145మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల బ్రహ్మాజీ, మూల్పూరి పూర్ణచంద్రరావు, రావులపాటి భానుకుమార్, మద్దాల స్వామి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న శివయ్య

గన్నవరం తహసీల్దార్ శివయ్యకు అవార్డు

గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఎన్నికల నమోదు అధికారి అవార్డును తహసీల్దార్ కేవీ శివయ్య అందుకున్నారు. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 2024లో సార్వత్రిక ఎన్నికలలో అత్యధిక ఓటర్ టర్న్ ఔట్ సాధించటం, ఎమ్మెల్సీ ఎన్నికల డి నోవో ఎలక్ట్రోరల్ రోల్ సిద్ధం చేయటం, ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణలో చూపిన సమర్థతకు గుర్తింపుగా అవార్డు అందజేసినట్లు తహసీల్దార్ కేవీ శివయ్య తెలిపారు.







జంక్షన్‌లో ఓటరు దినోత్సవం సందర్భంగా మానవహారం.. ఉయ్యూరులో ఏజీ అండ్‌ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థుల ర్యాలీ.. కంకిపాడులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

ఓటు బాధ్యతతో కూడిన హక్కు

- వాడవాడలా ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీలు
- సీనియర్ సిటిజన్లకు సత్కారం





రంగన్నగూడెం స్కూల్‌లో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఎన్ఎస్పీఎల్‌సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ.. బీఎల్‌వోల సేవలను గుర్తించి బహుమతులు అందజేసిన నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి షేక్ షాహిద్ బాబు

హనుమాన్‌జంక్షన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఓటు చాలా విలువైనది. హక్కు మాత్రమే కాదని బాధ్యతగా వయోజ నులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని బాపులపాడు తహసీల్దార్ బి.మురళీ కృష్ణ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం బాపులపాడు తహసీల్దార్ బి.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు,ఉపాధ్యాయులలతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన,డిబేట్,విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డీటీ అంకాలు, ఎఈంవో రాంబాలసింగ్, పాఠశాల హెచ్ఎం టీవీ.నాగేశ్వరరావు, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మన భవిష్యత్తు మనమే నిర్ణయించుకునేందుకు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం లాంటి హక్కు ఓటు దానిని బాధ్యతతో సద్వినియోగం చేసుకోవాలని ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, కాటూరి బిజయభాస్కర్, తదితరులు వేర్వేరు కార్యక్రమాల్లో తెలిపారు. వేలేరు, రంగన్నగూడెం, రేమల్లె, మల్లవల్లి, ఉమామహేశ్వరపురం, బొమ్ములూరు, ఆరుగొలను, కొయ్యూరు, కొత్తపల్లి తదితర గ్రామాల్లో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోడూరుపాడులో కొండపల్లి వెంకన్న, ఆర్నేపల్లి సూరిబాబు, పాండురంగారావు ఆధ్వర్యంలో రంగా రావు, వెంకన్న, సింహాచలం, తదితర సీనియర్లను సత్కరించారు. కానుమోలు, దంటగుంట్ల, కాకులపాడు తదితర గ్రామాల్లో సీనియర్ ఓటర్లను సచివాలయసిబ్బందితో కలిసి టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు.

గన్నవరం : అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి షేక్ షాహిద్ బాబు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగోలి, చిత్రలేఖనం, ప్రసంగం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే బూత్ లెవెల్ అధికారులకు మెమెంటో, ప్రశంస పత్రాలను అందజేశారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా షాహిద్‌బాబు మాట్లాడుతూ, ఓటు ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. ఓటు మనిషికి వజ్రాయుధమని తెలిపారు. ఓటు హక్కు పొందటంతో పాటు ఓటు వేయటం అందరి బాధ్యత అన్నారు. 18ఏళ్లు నిండిన వారు ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ కేవీ శివయ్య, డీటీ భవాని, ఆర్ఐ రవి పాల్గొన్నారు.

కంకిపాడు : ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. కంకిపాడు జడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అనేక మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడం లేదన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పదిమంది వృద్ధులను సత్కరించారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ఎంపీపీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ భవన్నా రాయణ, డీటీ ఎ. శ్రీనివాసరావు, ఎంఈవో కె.ఎస్.ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఉయ్యూరులో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉయ్యూరు నగరపంచాయతీ, మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థులతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. నగరపంచాయతీ చైర్మన్ వి సత్యనారాయణ, కమిషనర్ పి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం సురేశ్ కుమార్ పాల్గొని ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువను తెలియచేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. వార్డు కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, మెప్మాసిబ్బంది పాల్గొన్నారు.



చట్టాలు వివరిస్తున్న సీఐ రామారావు

విద్యార్థినులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలి : సీఐ

ఉయ్యూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆపదలు, అనుకోని సంఘటనల నుంచి బయటపడాలని ఉయ్యూరు సీఐ టి రామారావు అన్నారు. శ్రీ ఎంకె ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో విద్యార్థినులకు శని వారం ఆడపిల్లలు, ఆపద సమయంలో తీసుకోవాలిసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రమశిణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తేవాలన్నారు. స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు, ప్రిన్సిపాల్ మణికుట్టన్ నారాయణ్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి హయాం లో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలం లోని గంగూరులో రూ. 21 లక్షలతో రహదారుల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడు నెలల్లోనే అభివృద్ధి పరుగులు పెడు తుందన్నారు. విజన్ 2047తో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూసుకు పోతున్నారని, నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో సుమారు రూ. 60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అదే విధంగా గంగూరు గ్రామంలో చేపట్టిన కల్వర్టు పనులను ఆయన పరిశీలించారు. అక్కడ నుంచి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన పార్టీ కార్యకర్త అబ్దుల్ రషీద్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయా ఆనంద్ ప్రసాద్, అనుమోలు ప్రభాకర్, అక్బర్ బాషా, అబ్దుల్ సలాం, అబ్దుల్ గౌస్, ఇర్ఫాన్ పాషా, బండారు నాగేంద్రం, చుండూరు శివ, పల్లె సందీప్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తదితరులు

వ్యాసరచనలో రేమల్లె విద్యార్థిని ప్రతిభ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో రేమల్లె విద్యార్థి నియోజకవర్గ స్థాయిలో ద్వితీయస్థానం సాధించినట్లు హెచ్ఎం లూథర్‌పాల్ తెలిపారు. గన్నవరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా శనివారం జిల్లా ఎన్నికల నమోదు అధికారి సయ్యద్ బాబు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ విద్యార్థి గుంటసాని స్రవంతికి ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

ముగిసిన టెక్నో కల్చరల్ యువర్‌ఫెస్ట్-2025

ఉంగుటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ కళాశాలల విద్యార్థుల ఆలోచనలమధ్య సమన్వయం ఏర్పరచి, వారిలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించి, సంపూర్ణ వ్యక్తిత్వం కలవారిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఏటా తమ కళాశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో యువజనోత్సవాలు ఏర్పాటుచేస్తున్నట్లు తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం అన్నారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలనుండి హాజరైన సుమారు 3500మంది విద్యార్థులతో స్థానిక కళాశాలలో రెండురోజులుగా నిర్వహిస్తున్న టెక్నోకల్చరల్ యువర్‌ఫెస్ట్-2025 శనివారం విద్యార్థులు, అధ్యాపకుల కోలాహలం మధ్య సందడిగా ముగిసింది. చివరి రోజు డ్యాన్స్, సింగింగ్, మిస్టర్ పర్‌ఫెక్ట్, స్పాట్‌ఫోటోగ్రఫీ వంటి 12ఈవెంట్లకు సంబంధించి జరిగిన పోటీలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశాల్లో తమకున్న టెక్నికల్ స్కిల్స్‌ను, ప్రతిభను కనబరచి పలు బహుమతులు గెలుచుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు తెలుగు సంప్రదాయ నృత్యప్రదర్శనలతో అందరినీ అలరించారు.



తెలుగు సంప్రదాయ నృత్యప్రదర్శనలతో అలరించిన విద్యార్థినులు

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఉయ్యూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నియమ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు అవకాశమే ఉండదని రవాణాశాఖ ఉయ్యూరు యూనిట్ అధికారి సుబ్బారావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు పురసరించుకుని శ్రీ విశ్వశాంతి స్కూల్ ఆవరణలో శనివారం స్కూల్ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రత, పాటించవలసిన నియమాలపై అవగాహన కల్పించారు. బడిపిల్లలు ఉన్న బస్సు నడిపే డ్రైవర్లు జాగ్రతలు పాటించాలని, బడి బస్సు భద్రత భావి తరాలకు భరోసా అన్నారు. బస్సు, వాహనాలు నడిపేసమయంలో సెల్ ఫోన్ మాట్లాడవద్దని సూచించి దీనివల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. ఎంవీఐ ఆయోష పాల్గొని రోడ్డు నియమాలు, పాటించాలసిన ఆవశ్యకతను తెలిపారు.



రోడ్డు నిబంధనలు, భద్రతపై డ్రైవర్లకు సూచనలిస్తున్న రవాణశాఖ ఉయ్యూరు యూనిట్ అధికారి సుబ్బారావు

పశువైద్యశిబిరాలు అభినందనీయం

గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్ అన్నారు. మండలంలోని అజ్జంపూడిలో సర్పంచ్ కంచర్ల చిన్న ఆధ్వర్యంలో మల్టీ స్పెషాలిటీ వైద్యుల సహాయంతో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. దీనిని యార్లగడ్డ సతీష్ ప్రారంభించారు.

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు ఏరియా పశువైద్యశాలలో ఏడీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పశువైద్య ఆరోగ్య సదస్సు, వైద్యశిబిరం నిర్వహించారు. సదస్సులో ఎంపీపీ నగేష్‌తోపాటు జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, శ్రవంతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రేమల్లెలో పశు ఆరోగ్య శిబిరంలో 235 పశువులకు పరీక్షలు నిర్వహించి టీకాలు, మందులు అందజేశారు. పాడిరైతులకు మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు.

ఉంగుటూరు : మండలంలో ఆత్కూరు, తేలప్రోలు, ఉంగుటూరు, ఇందుపల్లి వెటర్నరీ డిస్పెన్సరీల పరిధిలోని పొట్టిపాడు, కొయ్యగూరపాడు, తుట్టగుంట, ముక్కపాడుల్లో శనివారం పశువైద్యాధికారులు డాక్టర్ ఎన్.నాగార్జున, డాక్టర్ సీహెచ్ మల్లిబాబు, డాక్టర్ జి.స్వర్ణలత, డాక్టర్ జి.సుధీర్‌బాబు నేతృత్వంలో పశుఆరోగ్యశిబిరాలు నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.490

ఉపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మునిసిపాలిటీ, మచిలీపట్నం కార్పొరేషన్ల పరిధిలో ఎనిమిది మంది ఉపాధ్యాయులకు శనివారం డీఈవో కార్యాలయంలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో తెలుగు, హిందీ, సోషల్ స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, గుడివాడ మునిసిపాలిటీలో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, ఒక ప్రధానోపాధ్యాయుడికి పదోన్నతి కల్పించారు.

పరిహారం అందజేత

మచిలీపట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కానూరు పంచాయతీలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో సూరగాని సుబ్రహ్మణ్యం మృతిచెందాడు. అతని తల్లి కోటేశ్వరమ్మకు శనివారం తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ రూ.5 లక్షల ప్రభుత్వ పరిహారం అందజేశారు.



పెదపాండ్రాక రెవెన్యూ పరిధిలో ఎన్‌హెచ్ 216 మార్జిన్ ఆక్రమించి, పూడ్చేసిన బాడవ మురుగు బోదె

మురుగు బోదె పూడ్చివేత

● హైవే మార్జిన్ ఆక్రమణ..ఎగువ రైతుల ఆందోళన

బంటుమిల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి పక్కన పెదపాండ్రాక రెవెన్యూ పరిధిలోని తన వ్యవసాయ భూమిని ఆనుకుని ఉన్న బాడవ మురుగుబోదెను రైతు కొమ్మా శివాజీ పూడ్చేశారు. పది సెంట్ల స్థలాన్ని జాతీయ రహదారి మార్జిన్ వరకు ఆక్రమించి మెరక చేశారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో మట్టితోలకాలు జరిపారు. జాతీయ రహదారి మార్జిన్ స్థలాన్ని కూడా మెరక చేయడంతో ఎగువ ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్ఐ శంకర్, రెవెన్యూ సిబ్బంది ఆప్రాంతానికి చేరుకుని మెరక పనులు ఆపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంట బోదెలు, మురికి బోదెలు పూడ్చేస్తే రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం తూర్పు కృష్ణా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.



విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమానుయేల్

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే అదాలత్

పెడన, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం అదాలత్‌లలో దొరుకుతుందని కన్స్యూమర్స్ గ్రీవెన్స్ రెసిడ్రల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) చైర్మన్, మాజీ న్యాయమూర్తి ఎన్.విక్టర్ ఇమానుయేల్ అన్నారు. తోటమూల ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లో ఆయన మాట్లాడారు. పెడన నియోజకవర్గ పరిధిలోని పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల అర్జీలు సమర్పించారు. వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. అధిక విద్యుత్ బిల్లులు, లో ఓల్టేజి సమస్యలపై ఎక్కువ అర్జీలు వచ్చాయి. విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానంద్, డీఈ జి.గోవిందరావు, టెక్నికల్ విభాగం డీఈ సుధాకర్, ఏడీఈ సీహెచ్ఆర్ఆర్ మాణిక్యాలరావు, ఏఈ ఏడుకొండలు, ఫోరం సభ్యులు కె.వెంకటకృష్ణ, కె. సునీత, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ పి.సాయిబాబు

చల్లపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని, సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా వారిని చైతన్యపరచాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, మెప్మా పీడీ పి.సాయిబాబు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రవిశంకర్, విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్ టి.సుధీర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

మోపిదేవి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను గ్రామాల్లోకి తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖల ఉద్యోగులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు రోజుల్లో మండలంలోని ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించి సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ఎంపీడీవో జె.స్వర్ణభారతి, విద్యుత్ శాఖ ఏఈ పాండురంగారావు, వెలుగు ఏపీఎం డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గూడూరు ఎంపీడీవోగా అనూహ్య



గూడూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గూడూరు ఎంపీడీవోగా టి. అనూహ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఘంటసాల ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమె ఆగస్టు 2024 నుంచి సెలవులో ఉన్నారు. సెలవు ముగించుకుని విధుల్లో చేరిన ఆమెను గూడూరు ఎంపీడీవోగా నియమిస్తూ జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

జోయలుక్కాస్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న కొల్లు నీలిమ

మచిలీపట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జోయలుక్కాస్ నగల ప్రదర్శనను శనివారం మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ ప్రారంభించారు. 25, 26, 27 తేదీల్లో ఈ ప్రదర్శన జరుగుతుందని, త్వరలో మచిలీపట్నంలో జోయలుక్కాస్ షోరూం ప్రారంభిస్తారని నీలిమ తెలిపారు.

అప్పు చెల్లించాలని ఆందోళన

మచిలీపట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పును వెంటనే చెల్లించాలంటూ బాధితులు డిప్యూటీ మేయర్ శీలం భారతి భర్త బాబ్జీ ఇంటి ముందు ఆందోళన చేశారు. శీలం బాబ్జీ గుమాస్తా సతీష్ పేరుతో డబ్బులు అప్పుగా తీసుకున్నారని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా భారతికి, అప్పు ఇచ్చిన వారికి మధ్య వాగ్వివాదం జరిగింది. సమాచారం అందుకున్న చిలకలపూడి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. తమకు అప్పు ఇప్పించి న్యాయం చేకూర్చాలని బాధితులు వారిని కోరారు.

కలెక్టర్ ఆదేశాలతో విద్యార్థుల బడిబాట

కోడూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం మండల పర్యటనలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఎస్టీ పిల్లలను ఉపాధ్యాయుడు నాగభూషణం బడిబాట పట్టించారు. శనివారం ఉల్లిపాలెం పరిసర ప్రాంతాల్లో కృష్ణానది కరకట్టపై నివసిస్తున్న 15 మంది యానాది పిల్లలను ఉల్లిపాలెం ప్రాథమిక పాఠశాలకు ఆయన తీసుకొచ్చారు. వీరందరూ రోజూ బడికి హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని హెచ్ఎం నీరజ అన్నారు. ఎంఈవోలు రామదాసు, శ్రీనివాసరావులు నాగభూషణం మాస్టారును అభినందించారు.

ఓటు వజ్రాయుధం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



కృష్ణా యూనివర్సిటీ, పెడన, మోపిదేవి సెంటరులో ఓటరు దినోత్సవ ర్యాలీలు

మచిలీపట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు వజ్రాయుధమని, మంచి పాలనను ఓటు వినియోగించుకోవడం ద్వారా పొందవచ్చని సబ్‌జైలు సూపరింటెండెంట్ పి.రమేష్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈడేపల్లి గ్రంథాలయంలో సీనియర్ ఓటర్లు నూకల సత్యనారాయణ, ఐనాల వీరభద్రరావు, భాస్కరరావు, పోలగాని రుక్మిణమ్మను ఆయన సత్కరించారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఓటర్ల దినోత్సవంలో కృష్ణావిశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ శోభన్‌బాబు పాల్గొన్నారు.

పెడనలో హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ

పెడన/పెడన రూరల్: భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి రైల్వేగేటు వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రైల్వేగేటు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. హైస్కూల్ ఆవరణలో జరిగిన సభలో కమిషనర్ ఎం.గోపాలరావు, తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కౌన్సిలర్ పిచ్చిక సతీష్, ఉపాధ్యాయ సంఘ నేత ఉమామహేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు అద్దంకి అశోక్‌కుమార్ పాల్గొన్నారు. పెడన మండలంలోని నందిగం, ఉరివి, చెన్నూరు, బల్లిపర్రు, నందమూరు, నడుపూరు, చేవేంద్ర, మడక, జింజేరు, లంకలకలవగుంట పంచాయతీల్లో సీనియర్ ఓటర్లను నందిగం సర్పంచి బొడ్డు చినబాబు సన్మానించారు.

చిత్రలేఖనం పోటీల్లో ఘంటసాల విద్యార్థినికి జిల్లా ఫస్ట్



జేసీ గీతాంజలిశర్మ నుంచి బహుమతి అందుకుంటున్న జాహ్నవి

ఘంటసాల: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఘంటసాల మహాత్మాగాంధీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కొండేటి జాహ్నవి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించింది. లఘు నాటిక విభాగంలో డి.జయసింధున గ్రూపు(బి.లక్ష్మీ ప్రణతి, బి.శశి ప్రియ, వి.చంద్రిక, ఎం.డేవిడ్, ఎం.చినబాబు) మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జేసీ గీతాంజలి శర్మ బహుమతులు అందజేశారు. విద్యార్థులకు ఎంఈవోలు శివశంకర్, మహమ్మద్ మోమిన్, ప్రధానోపాధ్యాయురాలు మల్లెల శ్రీ రంగవల్లి, విద్యాకుటుంబం, ఎస్ఎంసీ చైర్మన్ జె.రాంబాబు, వైస్ చైర్మన్ సునీత, టీడీపీ సీనియర్ నాయకుడు పరుచూరి సుభాష్ చంద్రబోస్ అభినందనలు తెలిపారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో..

మోపిదేవి/చల్లపల్లి/ఘంటసాల/కోడూరు/అవనిగడ్డ రూరల్: అవనిగడ్డ మండలం మోదుమూడిలో సిద్దాబత్తుల నారాయణరావు ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లు సన్మానించారు. మోపిదేవిలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఎస్ఐ సత్యనారాయణ, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఘంటసాల మండలం తెలుగురావుపాలెంలో సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, పెదముత్తేవి వసంతరావును సత్కరించారు. అచ్చెంపాలెంలో వీఆర్వో పామర్తి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రాజులపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు. శ్రీకాకుళం హైస్కూల్లో రెవెన్యూ ఉద్యోగులు, గ్రామస్తులు, విద్యార్థులతో సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. చినకళ్లేపల్లిలో సర్పంచ్ గుత్తికొండ రామారావు, కార్యదర్శి అబ్దుల్ నయీం పాల్గొన్నారు. చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. సర్పంచ్ డి.వనజాక్షి, ఈవో పి.వి.మాధవేంద్రరావు పాల్గొన్నారు. పురిటిగడ్డ హైస్కూల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజులపాటి అంకమ్మ పాల్గొన్నారు. కోడూరులో ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఎంఈవో రామదాసు అధ్యక్షతన విద్యార్థులకు ఓటరు దినోత్సంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనునాయక్, ఎంపీడీవో సుధాప్రవీణ్, ఎంఈవో-2 శ్రీనివాసరావు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న లక్ష్మీపురపు అజయ్‌బాబు

అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి
రూ.15 లక్షల విరాళం

పెడన, జనవరి 25 (పెడన): పట్టణంలోని గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానానికి కలిదిండికి చెందిన పారిశ్రామికవేత్త లక్ష్మీపురపు అజయ్‌బాబు రూ.15 లక్షల విరాళం ఇచ్చారు. దేవస్థానంలో స్ట్రాంగ్ రూమ్, వాటర్ ట్యాంకు నిర్మాణం నిమిత్తం ఆయన ఈ విరాళం ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్ సమక్షంలో శనివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు చెక్కును అందజేశారు. అజయ్‌బాబును, ఎమ్మెల్యేను దేవస్థానం అభివృద్ధి కమిటీ సన్మానించింది.

మల్లవోలు హైస్కూల్‌లో ఆడిటోరియం ప్రారంభం

గూడూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మల్లవోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో పూర్వవిద్యార్థి దాసరి సోమేశ్వరరావు తన సొంత నిధులు రూ.10 లక్షలతో ఆడిటోరియం నిర్మించారు. ఈ ఆడిటోరియంను శనివారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. పోతన స్వామి, బాసంశెట్టి శ్రీనివాసరావు, బత్తిన వీరబాబు, బుజ్జి, కాసగాని శ్రీనివాసరావు, గోపీ నాగబాబు, ప్రత్తిపాటి శ్రీనివాసరావు, చిడేపూడి ఏడుకొండలు, గోవాడ ప్రశాంతి, అల్లు బాల, కూనపరెడ్డి పాండురంగారావు, ఎంఈవో, హైస్కూల్ హెచ్ఎం పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



వక్కపట్లవారిపాలెంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీ సాంబశివరావు

నాగాయలంక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని అవనిగడ్డ ఏడీ డాక్టర్ సాంబశివరావు పేర్కొన్నారు. వక్కపట్లవారిపాలెంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు, పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్, పశువైద్యాధికారి సాయిమౌనిక, పశుపోషకులు పాల్గొన్నారు.

మేకావారిపాలెంలో..

చల్లపల్లి: పాగోలు పంచాయతీ శివారు మేకావారిపాలెంలో శనివారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ ఎం.నందకిషోర్ పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పశువులు, గొర్రెలు, కోళ్లకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ తోట శ్రీనివాసరావు, జడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, ఎంపీటీసీ సభ్యుడు మేకా బంగారుబాబు, ఈవో పిట్టు రాంబాబు పాల్గొన్నారు.

పుల్లపాడులో..

పెడన రూరల్: పుల్లపాడులో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో చూడి పశువులకు పరీక్షలు నిర్వహించారు. వ్యాక్సిన్లు ఇచ్చారు. గొర్రెలకు డీ వార్మింగ్ మాత్రలు ఇచ్చారు. 276 పశువులకు ఉచితంగా మందులు అందించారు. పశు వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్, చోడవరం నీటిసంఘ అధ్యక్షుడు గూడవల్లి భద్రాచలం పాల్గొన్నారు.

పోతేపల్లిలో..

మచిలీపట్నం టౌన్: పోతేపల్లిలో నిర్వహించిన పశువైద్యశిబిరంలో మండల పశువైద్యాధికారి దీపక్ డానియేల్ ఆధ్వర్యంలో 100 గొర్రెలకు టీకాలు వేశారు. 200 గొర్రెలకు నట్టల నివారణ మందు ఇచ్చారు.

దళితుల శ్మశానాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దళితుల శ్మశానాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేష్ డిమాండ్‌చేశారు. బుట్టాయిపేటలోని జ్యోతీరావుఫూలే విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజేష్ మాట్లాడారు. పున్నయ్య కమిషన్ నివేదికను అనుసరించి దళితుల శ్మశానాల అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా పేదలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.



పుచ్చగడ్డలో గోకులం షెడ్డును ప్రారంభించి, పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

241 గోకులం షెడ్ల నిర్మాణం

చల్లపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలో 241 గోకులం షెడ్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఉపాధి నిధులు రూ.2.30 లక్షలతో శనివారం లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డలో లబ్ధిదారుడు డొక్కు నాంచారయ్య నిర్మించుకున్న 50 గొర్రెల గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ కోట విజయరాధిక, ఎంపీమాలెంపాటి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి, టీసీ అధ్యక్షుడు గొరిపర్తి సుబ్బారావు, ఏపీవో రాజ్‌కుమార్, కనకమేడల వాసు పాల్గొన్నారు.

తుంగపల్లెమ్మ పాటల సీడీ ఆవిష్కరణ

అవనిగడ్డ: మాచవరంలోని తుంగపల్లెమ్మ అమ్మవారి భక్తిగీతాల సీడీని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న నరహరిశెట్టి పిచ్చేశ్వరరావు సతీమణి జ్యోతి, ప్రముఖ రచయిత గుడిసేవ విష్ణుప్రసాద్ రచించిన పాటలకు గాత్రం అందించారు.

దివ్యాంగుడికి బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత

స్వతంత్రపురంలో శుక్రవారం కలెక్టర్ బాలాజీ పర్యటనలో తన ఇబ్బందులు వివరించిన దివ్యాంగుడు నిడుమోలు సుబ్బారావుకు కలెక్టర్ రూ.90 వేల విలువైన ట్రై సైకిల్ మంజూరు చేశారు. శనివారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ లబ్ధిదారునికి దానిని అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వాడ రేవ్ల కామరాజు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

మోపిదేవి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం కార్యకర్తల కుటుంబాలకు భరోసానిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దానరావు తెలిపారు. శనివారం మోపిదేవి పంచాయతీ శివారు వార్పు వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, రైతు విభాగం జిల్లా అధికార ప్రతినిధి గవిని శివరామకృష్ణ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

మోపిదేవి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ వాడకాన్ని భారంగా చూడకుండా బాధ్యతగా ధరించాలని, ప్రమాదాల బారి నుంచి రక్షణ పొందాలని ఎస్సై వై.సత్యనారాయణ సూచించారు. శనివారం రాత్రి మోపిదేవి టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వాడకంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతీ ఒక్క వాహనదారుడు రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు.

పురోహిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా లొల్లా కుటుంబశాస్త్రి



మచిలీపట్నం టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మచిలీపట్నానికి చెందిన లొల్లా కుటుంబశాస్త్రి ఎన్నికయ్యారు. విజయవాడ లబ్బీపేటలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన ఎన్నికల్లో కుటుంబ శాస్త్రి ఎన్నికయ్యారు. కుటుంబ శాస్త్రికి రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన వ్యవస్థాపక అధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య నియామక పత్రం అందించారు. పి.వి.ఫణికుమార్, మోపర్తి సుబ్రహ్మణ్యం, సోమయాజుల రఘుశర్మ, కానుకొలను ఫణికిరణ్ శర్మ తదితరులు కుటుంబశాస్త్రిని అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 490

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం

పామర్రు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటన ముగించుకుని తిరిగి రాష్ట్రానికి వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తన జన్మదిన వేడుకలను పక్కన పెట్టి దావోస్‌లో పారిశ్రామిక దిగ్గజాలతో లోకేశ్ చేసిన సంప్రదింపులు, కృషికి మంచి ఫలితాలే లభించాయన్నారు.



గన్నవరం విమానాశ్రయంలో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



పామర్రులో సీనియర్ ఓటర్లను సత్కరించి, వారికి పాదాభివందనం చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



గుడివాడ ఎస్పీఎస్ పాఠశాలలో మాట్లాడుతున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం



మొవ్వ వీఎస్ఆర్ కళాశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పెంజంద్ర హైస్కూల్‌లో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న వీఆర్వో రవి, బొప్పన శివప్రసాద్

ఓటు వజ్రాయుధం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం ● సీనియర్ ఓటర్లకు సత్కారాలు

పామర్రు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు వజ్రాయుధమని, దేశ భవిష్యత్ నిర్ణయించేది ఓటరే అని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జడ్పీ హైస్కూల్లో ఓటు హక్కు ప్రాధాన్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిజాయితీగా ఓటు వేద్దాం..మంచి విద్యావంతుల్ని ప్రజా సేవకులుగా ఎన్నుకుందాం అనే నినాదాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించి, ఎమ్మెల్యే వారి ఆశీర్వాదం తీసుకున్నారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ ఉపసంచాలకుడు, పామర్రు నియోజకవర్గ ఎన్నికల ఎలోక్టోరల్ అధికారి జి.రమేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టినరేష్, కృష్ణాడెల్టా ప్రాజెక్టు వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, హెచ్ఎంఎస్ ఆలపాటి ఇందిర, తహసీల్దార్ గూడపాటి రవికాంత్, ఎంఈవో గుమ్మడి పద్మవాణి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బి.రజనీకాంత్ పాల్గొన్నారు.

గుడివాడలో ర్యాలీ

గుడివాడ: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీవో కార్యాలయం నుంచి ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు అధికారులు, విద్యార్థులతో కలిసి ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం ర్యాలీ నిర్వహించారు. ఎస్పీఎస్ పాఠశాలలో అధికారులు, ఓటర్లు, విద్యార్థులతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ రామకోటేశ్వరరావు, అసిస్టెంట్ కమీషనర్ వి.శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ చల్లా నాగప్రసాద్, ఆర్డీవో కార్యాలయపు డిప్యూటీ తహసీల్దార్లు బాలాజీ, లక్ష్మీ, ఆర్ఐ నాగబాబు, ఎంఈవో బాలాజీ, గురురాజు హోమియో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

మల్లాయిపాలెంలో..

గుడివాడ రూరల్: మల్లాయిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ సత్కరించారు. గ్రామ కార్యదర్శి ఆర్.కోటయ్య పాల్గొన్నారు.



మల్లాయిపాలెంలో వృద్ధులను సత్కరిస్తున్న ఎంపీడీవో డీవై విష్ణుప్రసాద్

గుడ్లవల్లేరు మండలంలో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో తహసీల్దార్ లోకరాజు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పెంజంద్రలో సీనియర్ ఓటర్లను వీఆర్వో రవి, మాజీ సర్పంచ్ బొప్పన శివప్రసాద్ సన్మానించారు. ఉలవలపూడిలో సర్పంచ్ పామర్తి కన్నెబాస్కరరావు ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు.

మొవ్వలో..

కూచిపూడి: మొవ్వ తహసీల్దార్ కార్యాలయం, మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, కాజ జడ్పీ పాఠశాలలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ప్రతిజ్ఞ, ర్యాలీలు చేశారు. మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మస్తాన్, సీనియర్ ఓటర్లు తాతినేని పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మొవ్వ వీఎస్ఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, అధ్యాపకులు డాక్టర్ ఎం.సుందరరావు, కె.ఆర్.మంజుల తదితరులు పాల్గొన్నారు. కాజలో మాజీ ఎంపీపీ తాతా నారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడంకిలో..

పమిడిముక్కల: తాడంకిలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. గ్రామానికి చెందిన 95 సంవత్సరాల కంభంపాటి ఆదిలక్ష్మికామేశ్వరిని గ్రామ సర్పంచ్ జంపపాన ధనలక్ష్మి, వీఆర్వో కోటేశ్వరరావు, బీఎల్వోలు సత్కరించారు.

పెదపారుపూడి హైస్కూల్‌లో..

పెదపారుపూడి: పెదపారుపూడి హైస్కూల్ విద్యార్థులతో కలిసి తహసీల్దార్ వై.రంగారావు ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, రాధాకృష్ణయ్య, దేవినేని సుబ్బయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి, ఉపాధ్యాయులు సుధాకర్, పంచాయతీ కార్యదర్శి షేక్ హసన్ షరీఫ్, సచివాలయ ఉద్యోగి రాజారావు, వీఆర్వో దానియేలు, ఇంజనీరింగ్ సహాయకులు నాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కార్మిక వర్గాల సంక్షేమానికి తాను అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం మీ కోసం మీ వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గౌరీశంకరపురం, సత్యనారాయణపురంలో ఆయన పర్యటించారు. కార్మికులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకుడు చేకూరి జగన్మోహనరావు ఆయన వెంట ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాలల ఎన్టీఆర్ ట్రోఫీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలను స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. టూటౌన్ సీఐ చల్లా నాగప్రసాద్, స్టేడియం కమిటీ కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు చేకూరి జగన్మోహనరావు, సత్యనారాయణ, అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడకా ప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మధ్యాహ్న భోజనం పరిశీలన

పామర్రు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో సామాజిక సమభావన పెంపొందించడంతోపాటు, వారిలో పౌష్టికాహార లోపాన్ని తగ్గించడం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాఅన్నారు. కంచర్లరామారావు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పలువురు విద్యార్థులకు స్వయంగా ముద్దలు తినిపించారు.

గోకులం షెడ్ల ప్రారంభం

కూచిపూడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చినముత్తేవి గ్రామంలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం ప్రారంభించారు. పాడి పరిశ్రమ స్థితిగతులపై రైతులతో చర్చించారు. జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాడిశెట్టి నరేష్, సర్పంచ్ కొమ్ము సౌదామణి, వీరంకి తులసీదాసు, టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ బండి వీరయ్య, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దావోస్ పర్యటన విజయవంతమైందని అన్నదానం

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి పరిశ్రమలు తీసుకువచ్చేందుకు దావోస్ పర్యటనకు వెళ్లి విజయవంతంగా పెట్టుబడులు తెచ్చారని, పట్టణంలోని పేదలకు అన్నదానం నిర్వహించారు. శనివారం అన్నక్యాంటీన్‌లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆశీస్సులతో కళింగ సాధికారిక సేవా సమితి జిల్లా అధ్యక్షులు సింగవరపు ప్రభాకరరావు ఆధ్వర్యంలో 400మందికి ఉచితంగా భోజన వసతి కల్పించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

తోట్లవల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు జడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు మెరుగైన బోధన చేసేందుకు స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. డెమోక్రటిక్ పీఆర్టీయూ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను రూపొందించిన మెటీరియల్‌ను శనివారం ఎంఈవో-1 జి.వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 సురేష్ చేతుల మీదుగా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందించారు. డెమోక్రటిక్ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం రచించి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో బీజేపీ పట్టణాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దేవరపల్లి చిన్న, బోనం గోపిక, రుద్రపాటి హంసలేఖ, రీటా, చరణ్ పాల్గొన్నారు.



మల్లాయిపాలెంలో అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● ప్రజలకు ఎస్పీ గంగాధరరావు సూచన

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు సూచించారు. శనివారం తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేసి, కేసుల పూర్వాపరాలను పరిశీలించి, దర్యాప్తు జరుగుతున్న తీరు, స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు వాటి వివరాలను సమీక్షించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీషీట్లు తెరుస్తామని, జూదక్రీడలను ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్య నిస్తూ శక్తి టీమ్‌లను ఏర్పాటు చేసామన్నారు. మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులను దిశానిర్దేశం చేశారు. స్టేషన్‌లో మొక్కలు నాటారు. డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్, రూరల్ సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ఎస్సై ఎన్.చంటిబాబు పాల్గొన్నారు.



తాలుకా పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు

మురుగు కాలువలో మృతదేహం

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బేతవోలులోని ఆదిత్య వాటర్ ప్లాంట్ సమీపంలో మురుగు కాలువలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది ఉన్నాడని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ శనివారం తెలిపారు. వయస్సు 60 నుంచి 70 ఏళ్లు ఉంటాయని, మాసిన గడ్డం, దేహంపై నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.





విజేతలతో మొవ్వ హైస్కూల్ హెచ్ఎం, పీడీలు

సబ్‌జోన్ ఆటల పోటీల్లో మొవ్వ విద్యార్థుల సత్తా

కూచిపూడి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పామర్రు సబ్ జోన్ 80వ గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పమిడిముక్కల మండలంలో నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర సీనియర్ విభాగంలో కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్, టెన్నికాయిట్‌లో ప్రథమ స్థానం, జూనియర్స్ విభాగంలో కబడ్డీ, వాలీబాల్‌లో ప్రథమ, త్రోబాల్ టెన్నికాయిట్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. శనివారం పాఠశాలలో విజేతలైన విద్యార్థులతోపాటు శిక్షణ ఇచ్చిన పీడీలు అప్పికట్ల రామారావు, మనోహరిని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పసుపులేటి శివకోటేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ గురువిందపల్లి బాబూరావు అభినందించారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

గుడివాడ రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎరువుల షాపుల యజమానులు నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారిణి అనంతలక్ష్మి తెలిపారు. శనివారం గుడివాడలో ఎరువుల షాపులను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. క్రిమిసంహారక మందులపై తేదీలు తనిఖీ చేశారు. ప్రతీ రైతుకు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు ఇవ్వాలని, ఆ బిల్లులపై పూర్తి వివరాలు ఉండాలని సూచించారు.



ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న ఏవో అనంతలక్ష్మి

పోస్టుకార్డు ఉద్యమానికి విశేష స్పందన

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గుడివాడ-కంకిపాడు రహదారిని అభివృద్ధి పరచాలని భవిష్యత్ భద్రతా దళం చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి విశేష స్పందన లభించింది. శనివారం పెదపారుపూడి మండలం భూషణగుళ్ల వద్ద చేపట్టిన సంతకాల సేకరణ చేపట్టారు. ద్విచక్రవాహనదారులతో పాటు కార్ల యజమానులు సంతకాలు చేసి పోస్టుకార్డు ఉద్యమానికి మద్దతు తెలిపారు. భద్రతా దళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ, సభ్యులు ఎండీ తాహెర్‌బాషా, జి.పూర్ణచంద్రరావు, ఎం.దుర్గారావు, మస్తాన్ పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న భవిష్యత్ భద్రతా దళం సభ్యులు

రేపు జాతీయ సెమినార్

గుడ్లవల్లేరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో సోమవారం బయోటెక్నాలజీ బ్రేక్ త్రూస్ రీ డిఫైనింగ్ ఫార్మశీ త్రూ కటింగ్ ఎడ్జి రీసెర్చ్ అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల, అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజి అండ్ ఫార్మశీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే సెమినార్ బ్రోచర్‌ను శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆవిష్కరించారు. మధ్యప్రదేశ్ జబల్పూర్‌కు చెందిన మాంగల్యతాన్ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.ఎస్ సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, 500 మంది వివిధ విశ్వవిద్యాలయాలు,కళాశాలు, ఫార్మా పరిశ్రమల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు హాజరువుతారని తెలిపారు.

పశు ఆరోగ్య శిబిరం- లేగదూడల ప్రదర్శన రేపు

పమిడిముక్కల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మేడూరులో ఉచిత పశు ఆరోగ్య శిబిరం, లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పశువైద్య అధికారి రామ్ నరేశ్ తెలిపారు. శిబిరంలో గేదెలకు వైద్య పరీక్షలు, దూడలకు ఏలిక పాముల నివారణకు మందులు, గొర్రెలు, పశువులకు నట్టల నివారణ మందులు అందిస్తామని, లేగదూడల ప్రదర్శన, అందాల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా పశు సంవర్ధక అధికారి నరసింహులు, ఏపీఎల్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, పలువు రు పశువైద్యులు వైద్యసేవలందిస్తారని తెలిపారు. మేడూరు పరిసర గ్రామా ల పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల లెక్కింపు

పమిడిముక్కల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మంటాడలో అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో హుండీలను మంగళవారం ఉదయం 10.30 గంటలకు లెక్కిస్తామని ఆలయ అధికారి మాధవీలత తెలిపారు. ఆసక్తికల భక్తులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

28న ఏఎన్ఆర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఈనెల 28వ తేదీన మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్ తెలిపారు. ఐసీఐసీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లో రిలేషన్‌షిప్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. డిగ్రీలో 50శాతం మార్కులు ఉండాలని, పాస్ అవుట్స్, డిగ్రీ, పీజీ ఆఖరి ఏడాది విద్యార్థులు అర్హులన్నారు. జాబ్‌మేళాకు వచ్చు ఫార్మల్ డ్రెస్, బయోడేటా, ఆధార్ కార్డు ఒరిజినల్, ఫొటోస్టాట్, ఎస్సెసీ, ఇంటర్ మార్కుల మెమో, డిగ్రీ ఉత్తీర్ణులు ఫోటోస్టాట్ కాపీలను, రెండు పాస్‌పోర్టు ఫోటోలు తీసుకురావాలన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల రక్తదానం

గుడివాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గౌరీశంకరపురంలోని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల 30మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం రక్తదానం చేశారు. అనంతరం రక్తదాత ప్రాణదాత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకరనాథ్ విచ్చేశారు. ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆలియాబేగం, ఏ.వో బాలాజీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మునిసిపాలిటీ, మచిలీపట్నం కార్పొరేషన్ల పరిధిలో ఎనిమిది మంది ఉపాధ్యాయులకు శనివారం డీఈవో కార్యాలయంలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో తెలుగు, హిందీ, సోషల్ స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, గుడివాడ మునిసిపాలిటీలో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, ఒక ప్రధానోపాధ్యాయుడికి పదోన్నతి కల్పించారు.